ప్రజాశక్తి

శుక్రవారం 18 జులై 2025

విజయరామరాజును కలిసిన బేబి నాయన

ప్రజాశక్తి - కురుపాం

మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజును బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన చినమేరంగిలో గల తన కోట వద్ద గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితులు, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్‌ను కురుపాంలో ఆయన కోట వద్ద కలిసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం, జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు గూర్చి సుదీర్ఘంగా చర్చించుకున్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వర్క్‌షాపులో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ భార్గవి, పక్కన ఐటిడిఎ పిఒ

జిఒ 3పై అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తా

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిఒ 3పై గిరిజనుల అభిప్రాయాలను సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి చెప్పారు. జిఒ3, గిరిజన చట్టాలపై అభిప్రాయాలు, సూచనలు, సలహాలపై వర్క్ షాప్ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహించారు. గిరిజన సంఘాలు, గిరిజన ఉపాధ్యాయ సంఘాలు, న్యాయవాదులు, గిరిజన ప్రతినిధులు ఈ సమావేశంలో మాట్లాడారు. ఈ వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన జిఒ 3 సుప్రీంకోర్టు రద్దు చేసినందున గిరిజన సంఘాలు, గిరిజన ఉపాధ్యాయుల సంఘాలు, న్యాయవాదులు చేసిన ఉద్యమాల ద్వారా తిరిగి పునరుద్ధరణ చేయాలని దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దీనికి స్పందించి గిరిజన ప్రాంతంలోని ఐటిడిఎల పరిధిలో వర్క్‌షాప్ ఏర్పాటు చేసి అభిప్రాయాలను స్వీకరించేలా సమావేశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా బుధవారం రంపచోడవరంలో, గురువారం పార్వతీపురం మన్యం జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వీకరించిన అభిప్రాయాల్లో ముఖ్యమైన వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామని ఆమె తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శితో చర్చించామన్నారు. వాటితో పాటు ఇక్కడ గిరిజనులు సూచించిన మంచి సూచనలను కూడా పరిగణలోకి తీసుకొని, చర్చించి మరింత మెరుగ్గా ఈ జిఒను అమలు చేసేందుకు వీలుంటుందని ఆమె వివరించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఎపిఒ, పలువురు అధికారులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చట్టమొక్కటే... జిఒ 3కు ప్రత్యామ్నాయం

గిరిజన సంఘాల నాయకులు

సుప్రీం కోర్టు రద్దు చేసిన జిఒ 3కు ప్రత్యామ్నాయంగా పార్లమెంటులో చట్టం చేయడం ఒక్కటే మార్గమని పలువురు గిరిజన సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. జీవో 3పై నిర్వహించిన వర్క్ షాప్‌లో గిరిజన సంఘాల నాయకులు మాట్లాడారు. తొలుత గిరిజన సంక్షేమ శాఖ న్యాయసలహాదారు పి.త్రినాధరావు మాట్లాడుతూ జిఒ 3ను సుప్రీంకోర్టు రద్దు చేయడానికి దారితీసిన పరిస్థితుల గురించి వివరించారు. గిరిజనులకు నష్టం లేకుండా జిఒ 3కు ప్రత్యామ్నాయంగా ఏమి చేయాలన్న దానిపై ప్రభుత్వం గిరిజన సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆదివాసీ జెఎసి గౌరవాధ్యక్షులు నిమ్మక జయరాజ్, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణ మూర్తి మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టిడిపి ప్రభుత్వం జిఒ 3కు ప్రత్యామ్నాయంగా పార్లమెంటులో చట్టం చేయాలని కోరారు. దీనిపై గతం ప్రభుత్వం సుప్రీంకోర్టులో సరైన వాదన వినిపించకపోవడం వల్లే రద్దు చేసిందని చెప్పారు. ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు అమర్‌నాథ్ మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన హక్కులకు భంగం కలిగినప్పుడు న్యాయస్థానాల్లో ప్రభుత్వమే వారి తరపున పోరాడాలని కోరారు. గిరిజన ఐక్య వేదిక గౌరవాధ్యక్షులు గేదెల రామకృష్ణ మాట్లాడుతూ జిఒ 3కు ప్రత్యామ్నాయంగా చట్టం చేయాల్సిన అవసరం వుందన్నారు. గిరిజన గ్రామాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు.సభలో మాట్లాడేందుకు అవకాశం లేని సంఘాలు అభిప్రాయాలను నిర్దేశించిన ఫార్మాట్‌లో రాసి అందజేయాలని గిరిజన సంక్షేమ డైరెక్టర్ భార్గవి కోరారు. గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్, అధ్యక్షులు తాడంగి సాయిబాబు కూడా వందశాతం ఉద్యోగాల రిజర్వేషన్ కోసం చట్టం చేయాలని కోరారు.

మాట్లాడే అవకాశం లేదని అసంతృప్తి

జిఒ 3పై నిర్వహించిన వర్క్ షాప్‌లో గిరిజన నాయకులు మాత్రమే ఉండాలని, గిరిజనేతరులు బయటికి వెళ్లి పోవాలని కొంతమంది గిరిజన సంఘాల నాయకులు వాదించారు. దీంతో జిల్లాలో గిరిజన సంక్షేమం కోసం పనిచేస్తున్న కొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బయటికి వెళ్లి పోయారు. ఒక దశలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ్ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నిత్యం గిరిజన సమస్యలు పరిష్కారానికి పోరాడే ఆదివాసీ గిరిజన సంఘం నాయకులకు వర్క్ షాప్‌లో మాట్లాడే అవకాశాన్ని ఐటిడిఎ అధికారులు ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తమైంది.

ఐటిడిఎ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వందశాతం ఉద్యోగ రిజర్వేషన్ చట్టం చేయాలి

ఐటిడిఎ కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ధర్నా

షెడ్యూల్డ్ ఏరియాలో జిఒ 3 స్థానంలో వంద శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ నియామక చట్టం చేయాలని కోరుతూ గురువారం ఐటిడిఎ కార్యాలయం వద్ద ప్రజాసంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. జిఒ నెంబర్ 3 రద్దు చేయడంతో ప్రత్యామ్నాయ చట్టం తీసుకొచ్చి అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగం పొందే హక్కును ఆదివాసీ యువత కోల్పోయిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా డిఎస్‌సిలో ఐదో షెడ్యూల్ ఏరియాలో వందశాతం రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వలేదని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడం వల్ల ఆదివాసి యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో రాష్ట్ర వ్యాప్తంగా ఐటిడిఎ పరిధిలో 766 పోస్టులకు గాను ఆదివాసీలకు కేవలం 42 పోస్టులు మాత్రమే కేటాయించారని తెలిపారు. ఆదివాసీలకు ఆరు శాతం, గిరిజనేతరులకు 94 శాతం పోస్టులు కేటాయించడం ఆదివాసీలకు తీవ్ర అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 3 స్థానంలో ఆదివాసీ ప్రాంతంలో 100శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసి ప్రాంతంలో 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తున్న జీవో నెంబర్ 3ను సుప్రీంకోర్టు రద్దు చేయడంపై 2020లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుండి మొత్తం 17 రివ్యూ పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలైనా ఆదివాసీలకు న్యాయం జరగలేదని చెప్పారు. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు 100శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పనకు గత రాష్ట్ర ప్రభుత్వం ఐదవ షెడ్యూల్డ్ క్లాజ్ రెండు ప్రకారం చట్టబద్ధత కల్పిస్తామని ట్రైబల్ అడ్వైజరి కౌన్సిల్‌లో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజన సంక్షేమ శాఖకు సిఫారసు చేసిందని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదివాసీలకు 100శాతం ఉద్యోగాల రిజర్వేషన్ కల్పనకు కట్టుబడి ఉన్నట్లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆదివాసి ప్రాంతంలో జీవో నెంబర్ 3 స్థానంలో ఏజెన్సీ ప్రాంతంలో 100శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ నియామక చట్టం చేయాలని కోరారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె రామస్వామి, మండింగి రమణ, అప్పారావు, సిఐటియు నాయకులు మన్మధరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు, భాస్కరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, రాజు, డేవిడ్, కే సాంబమూర్తి, సూరిబాబు, సిఐటియు నాయకులు రెడ్డి వేణు, గొర్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ డైరెక్టర్‌కు సిహెచ్‌డబ్ల్యుఒలు వినతి

మన్యం జిల్లాలో పని చేస్తున్న 1700 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను, ఆశా కార్యకర్తలుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ భార్గవికి వినతిపత్రం అందజేశారు. ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు నాలుగు వేల రూపాయలతో పని చేస్తున్నారని చెప్పారు. ఈ జీతం కూడా నెలల తరబడి మంజూరు కావడం లేదన్నారు. పని ఒత్తిడి తగ్గించాలని, ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పరిధిలో 8 మండలాల్లో పిహెచ్‌సిలలో 974 మందికి డిసెంబర్ 2019 నుండి ఆగస్టు 2020 వరకు 4000 చొప్పున బకాయి ఉన్నదని, ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కారం కాలేదని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ భవాని రాణి, మాణిక్యం, సూర్య కళ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, బంకురు సూరిబాబు, కే సాంబమూర్తి పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఎదురుచూపు

బయట మార్కెట్లో దరువు ●ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పక్షం రోజులు కావస్తున్నా ఎరువులు రైతు సేవా కేంద్రాలకు చేరలేదు. మన పాలకులు, అధికారులు మాత్రం ఎరువుల కొరతలేదని ప్రకటనలు గుప్పించినప్పటికీ క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదు. కనీసం సీతంపేట మండలానికి రెండు వారాలు గడుస్తున్నా ఎరువులు రైతు సేవ కేంద్రాలకు చేరకపోవడంతో రైతులు ప్రైవేట్ మార్కెట్ల వైపు పరుగులు తీస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు ఎరువుల ధరలు అమాంతంగా పెంచడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చుట్టుపక్కల మండలాలకు డిఎపి, యూరియా చేరుకొని సరఫరా కూడా జరిగిపోయింది. అయితే సీతంపేట ఏజెన్సీలో మాత్రం ఇంతవరకు ఎరువులు రాకపోవడం విడ్డూరంగా ఉంది.

మండలంలో 31 సచివాలయాలు అనుబంధంగా 29 రైతు సేవా కేంద్రాలు నెలకొల్పారు. ఈ ఖరీఫ్‌లో వరి 6,348 ఎకరాల్లో 3, 153 మంది రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఏజెన్సీలోని రైతులు వర్షాలపైనే ఆధారపడుతున్నారు. వర్షాలు అడపా దడపా పడినప్పటికీ వర్షం తక్కువ శాతం పడింది. కొద్దో గొప్ప పడిన వర్షపు నీటిని ఒడిసి గట్టిన ప్రాంతాల్లో బావులు, గెడ్డలు, ఊట ప్రాంతాల్లో ఉన్న పొలాల్లో సుమారు 300 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. అంతవరకు బాగానే ఉంది. అయితే వరినాట్లు తొందరగా పెరగాలంటే యూరియా, డిఎపి ఎక్కువగా వేస్తేనే ఉడుపులకు అందుతాయి. సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఇంకా ఎరువులు రాకపోవడంతో రైతులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేయడానికి పరుగులు తీస్తున్నారు. రెండు వారాలు కావస్తున్నా ఇంకా రైతు సేవా కేంద్రానికి యూరియా, డిఎపి రాకపోవడమేమిటని గిరిజన రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఎరువులు రైతు సేవా కేంద్రాలకు చేరలేదు

వరి నాట్లు వేసి వారం పది రోజులు కావస్తున్నా, ఇంకా రైతు సేవా కేంద్రాలకు యూరియా, డిఎపి రాలేదు. దీంతో రైతులు అడుగుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఏజెన్సీ ప్రాంతానికి సరఫరా చేయాలి.

జీలకర్ర సుందరమ్మ,
సర్పంచ్, ధారపాడు పంచాయతీ.

రెండురోజుల్లో ఎరువులు వస్తాయి

రెండు రోజుల్లో ఎరువులు వస్తాయి. 20 టన్నులు యూరియా, పది టన్నుల డిఎపికి ప్రతిపాదనలు పంపించాం. మరో రెండు రోజుల్లో రైతు సేవ కేంద్రాలకు చేరుతాయి.

వై వాహిణి,
మండల వ్యవసాయ అధికారి, సీతంపేట

పోలీసుల పహారాలో యూరియా కోసం క్యూలో నిల్చొన్న రైతులు

యూరియా కోసం క్యూకట్టిన రైతులు

వీరఘట్టం : మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రానికి యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు మార్కెట్ యార్డ్ వద్దకు చేరుకొని క్యూ కట్టారు. యూరియా కోసం రైతులు అధిక మొత్తంలో రావడంతో అక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ సిబ్బంది సహాయంతో రైతులకు సక్రమంగా యూరియా పంపిణీ చేసినట్లు స్థానిక వ్యవసాయ అధికారి జక్కువ సౌజన్య తెలిపారు. ఎకరాకు ఒక బస్తా యూరియా చొప్పున పంపిణీ చేసినట్టు తెలిపారు. మండలంలోని 24 రైతు సేవా కేంద్రాల ద్వారా 519 మెట్రిక్ టన్నుల యూరియా, 135 మెట్రిక్ టన్నుల డిఎపి పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 200 మెట్రిక్ టన్నుల యూరియా, 260 మెట్రిక్ టన్నుల డిఎపిను తెప్పించేందుకు అన్ని విధాలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యంగా ఉండొచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వెల్లడించారు. పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని సుంకి, సంతోషపురం గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి ప్రజలతో మమేకమై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 30 వరకు పారిశుధ్య పక్షోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రజలను కూడా భాగస్వాములను చేసి పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వ్యాధులు రాకుండా నివారించడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. పరిసరాల పరిశుభ్రతను పెంపొందించడానికి, వ్యాధులు రాకుండా నివారించడానికి నిర్వహించే కార్యక్రమమే పారిశుధ్య పక్షోత్సవాలని పేర్కొన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, అందుకు వేర్వేరు డస్ట్ బిన్లను ప్రతి ఇంటికీ అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మురుగునీటి కాలువలు, మంచినీటి ట్యాంకులను శుభ్రపరచడం, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం, కలుషిత నీటికి ఆస్కారం లేకుండా స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడం, ఇందుకు అవసరమైన నీటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రజలకు వివరించారు. పరిసరాల పరిశుభ్రత, సేకరించిన చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలని, తద్వారా వర్మీకంపోస్ట్ తయారు కావాలని, దీనివల్ల ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఈ సందర్భంగా సుంకిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి వర్మీ కంపోస్టును పరిశీలించారు. సేంద్రియ ఎరువుగా ఉపయోగపడే వర్మీకంపోస్టు మార్కెటింగ్ ముఖ్యం కాదని, తయారీపై దృష్టి సారించాలని సూచించారు. రోజువారీ కార్యక్రమాల వివరాలను పంచాయతీలు వారీగా సంబంధిత యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక పర్యటనలో డిపిఒ టి.కొండలరావు, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికార ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై విశాఖపట్నం జిల్లా విజిలెన్స్ సిఐ పి.రమణయ్య, విజయనగరం జిల్లా రాజాం వ్యవసాయ శాఖ ఎడిఎ కె.చంద్రశేఖరరావు తనిఖీలు చేపట్టారు. ఎరువులు ఎక్కువ ధరకు విక్రయించకూడదని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని షాపు యజమాని జామి కేశవను హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎరువుల స్టాకు రికార్డులను వ్యత్యాసాలు క్షుణంగా పరిశీలించారు. ఈ దాడుల్లో అధికారులతో పాటు ఎఒ వై.వాహిని తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని భోగి శశిభూషణరావు ఎరువుల దుకాణాన్ని గురువారం రాత్రి విజిలెన్స్ సిఐ పి రమణయ్య పరిశీలించారు. స్టాక్ రికార్డు, యూరియా నిల్వ, ఈపాస్ యంత్ర%శీ% క్షుణ్ణంగా పరిశీలించారు. ఎటువంటి లోపల లేకపోవడంతో రైతులకు సరసరమైన ధరలకే ఎరువులు విక్రయాలు జరపాలని డీలర్ ను ఆదేశించారు. ఈయనతో పాటు ఎడికె చంద్రశేఖర్, మన్యం జిల్లా కార్యాలయ ఎఒ రవీంద్ర, స్థానిక ఏవో జక్కువ సౌజన్య ఉన్నారు.

భామిని : మండలంలోని పలు ఎరువుల దుకాణాలను, విజిలెన్స్ వ్యవసాయ శాఖ సిబ్బంది గురువారం పరిశీలించారు. ఎరువుల దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్, ఫిజికల్ స్టాక్‌ను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఎరువులు అమ్మకాల చేపట్టాలని, కృత్రిమ కొరత సృష్టించొద్దని, ఎరువులు కొన్న రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఎరువులు షాప్ డీలర్లకు తెలిపారు. ఎక్కువ ధరకి ఎరువులు అమ్మకాలు చేపట్టినట్టు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని, ఖరీఫ్ సీజన్లో పలు దపాలుగా తనిఖీలు నిర్వహిస్తామని డీలర్లకి తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిఐ రమణయ్య, రాజాం వ్యవసాయ శాఖ ఎడి చంద్రశేఖరరావు, పాలకొండ వ్యవసాయ శాఖ ఏడి రత్నకుమారి, పాలకొండ టెక్నికల్ ఎఒ రవీంద్ర, భామిని వ్యవసాయ అధికారి తిలక్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పర్వానికి కురుపాం రాజకీయం

- భూములను ఆక్రమించారంటూ పుష్పశ్రీవాణిపై కూటమి నాయకుల ఆరోపణ
- అసభ్యకర పోస్టులపై ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో నిన్న మొన్నటి వరకు టిడిపి, వైసిపి నాయకుల మధ్య తారాస్థాయికి చేరిన మాటలు యుద్ధం నేడు ఫిర్యాదుల పర్వానికి చేరింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి నాయకులు ప్రెస్ మీట్‌లతో ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ నువ్వెంత అంటే నువ్వెంతంటూ దుమ్మెత్తు పోసుకుంటున్నారు. ఇది చినుకు చినుకు గాలి వానలా ఇరు పార్టీల రాజకీయ వేడి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకొనే వరకూ వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిపై సోషల్ మీడియాలో వైసిపి నాయకులు అసభ్యకర పోస్టులు పెడుతున్నారని టిడిపి నాయకులు గరుగుబిల్లి, జియమ్మవలస పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణిపై ఫేస్బుక్, ఇతర మాధ్యమాల్లో టిడిపి నాయకులు ఉద్దేశపూర్వకంగానే అసభ్యకర పోస్టులు సోషల్ మీడియాలో పెడుతున్నారని, మహిళ ప్రజా ప్రతినిధులను కించపరిచేలా ఉన్నాయని జియమ్మవలస పోలీస్ స్టేషన్లో వైసిపి నాయకులు, జడ్పిటిసి శశికళ ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా దుడ్డుఖల్లు పంచాయతీ చింతలపాడు రెవెన్యూ గ్రామ సమీపంలో 8 ఎకరాల 96 సెంట్లు భూమిని మాజీ మంత్రి పుష్పశ్రీవాణి తన సహచరుల పేరుతో రికార్డులు సృష్టించి వారి వద్ద కొనుగోలు చేసినట్లు కూటమి నాయకులు గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్ శేఖర్‌కు ఫిర్యాదు చేశారు. 8ఎకరాల భూమి కొంటే 16 ఎకరాలకు కంచె వేసి ఆక్రమించారని ఆరోపించారు. అలాగే పి.ఆమిటి పంచాయతీ గోపాలపురం సమీపాన నాలుగు ఎకరాలు, ఎగుమండ, మల్లు గూడ గ్రామాల మధ్య 12 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నట్లు వారు ఆరోపించారు. పుష్ప శ్రీవాణి ఆక్రమించుకున్న గిరిజన భూములపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కూటమి నాయకులు తహశీల్దార్‌ను కోరారు. మాటల దాడితో ప్రారంభమైన టిడిపి, వైసిపి నాయకుల మధ్య మాటలు యుద్ధం, ఫిర్యాదుల పర్వం ఏ మేరకు దారితీస్తుందో అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పుష్పశ్రీవాణిపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కూటమి నాయకులు

ఎంసి చైర్‌పర్సన్‌గా గొట్టాపు గౌరి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పార్వతీపురం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గొట్టాపు గౌరిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తీర్వులు జారీ చేసింది. ఈమె 2014లో ఎంపిపి పనిచేశారు. ఆమె భర్త గొట్టాపు వెంకటనాయుడు కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

మినీ గోకులాలతోనే పాడి అభివృద్ధి

కురుపాం : మినీ గోకులాలతోనే పాడి పరిశ్రమ అభివృద్ధి సాధ్యమని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు అన్నారు. గురువారం ఆయన కురుపాంలో రైతులు నిర్మించిన మినీ గోకులాల షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి పెట్టి అన్నదాతల సమస్యలతో పాటు పశుపోషకులకు, జీవాలు, కోళ్ల పెంపకం దారుల కష్టాలు తీర్చేందుకు మినీ గోకులాల నిర్మాణాలను చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 2024-25లో 972 మినీ గోకులాలను మంజూరు చేసి నిర్మాణాలు జరిగాయన్నారు.

పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. గురువారం నగర పంచాయతీ కమిటీ విస్తృత సమావేశం నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ రోజురోజుకు విస్తరిస్తుందని, సుమారు 50 కార్యాలయాలు, 20 వార్డుల పరిధిలో 40 వేల జనాభా ఉన్నారన్నారు. జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. ఒక మైక్రోపాయింట్‌కు ఇద్దరు నియమిస్తే 80 మంది అవసరమవుతారన్నారు. పారిశుధ్య నిర్వహణకు 120 మంది కార్మికుల అవసరం కాగా 46 మంది ఉన్నారన్నారు. పారిశుధ్య నిర్వహణకు భౌగోళిక పరిస్థితులు పరిశీలించి కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. సమగ్రంగా పనిముట్లు కూడా సరఫరా చేయాలన్నారు. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించడంలో పాలకులు వైఫల్యం చెందారని, మండలంలోని ఓని రెవెన్యూ పరిధిలో విజయరాంపురం దగ్గరలో పెత్తందారులకు 22-ఎలో పదేసి ఎకరాలు చొప్పున డి పట్టాలు ఉన్నాయని, వాటిని రద్దుచేసి డంపింగ్ యార్డ్‌కు స్థలం చేకూర్చుడంలో అధికారి యంత్రాంగం, ఎమ్మెల్యే స్పందించాలని కోరారు. నగర పంచాయతీ సంపూర్ణ పారిశుధ్య నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా చింతల సురేష్, ప్రధాన కార్యదర్శిగా చింతల సంజీవి, కోశాధికారిగా పడాల వేణు, సభ్యులుగా శ్రీదేవి, విమల, రఘు, ముణి, కార్తీక్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షులు రమణారావు

మక్కువ వైద్యాధికారిగా సాయితేజ

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారిగా డాక్టర్ వారణాసి సాయితేజ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన డాక్టర్ హరికృష్ణకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మొదటిసారి విశాఖకు చెందిన సాయి తేజ బాధ్యతలు చేపట్టారు.

నేడు పశువైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన పశువైద్యశాల భవనాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం ప్రారంభిస్తారని పశు వైద్యాధికారి లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న నాయకులు, రైతులు హాజరు కావాలని కోరారు.

మంచి ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు ఇప్పటి నుంచే క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించడానికి వీలుంటుందని మన్యం జిల్లా డివిఇఒ నాగేశ్వరరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురం కస్తూరిబా పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఇంటర్ విద్యార్థులకు జరుగుతున్న యూనిట్ పరీక్షలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని సద్వినియోగం చేసుకొని చదివిననాడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు అని అన్నారు. అధ్యాపకులు ఎప్పటికప్పుడు తమ పాఠ్యాంశాలను పూర్తి చేయాలని, వారాంతపు పరీక్షలు పెట్టి విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీ రంజిని ఉన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కొత్తవలసలో ఇంటింటి చెత్త సేకరణను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ ప్రతి ఇంటి వద్దకు వెళ్లే బుట్ట బుట్ట ద్వారా సప్త సేకరణ చేసి తడి చెత్త పొడి చెత్తను వేరు చేయాలన్నారు. అలాగే చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి దాని ద్వారా ఆర్థిక వనరుగా మార్చుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను పరిశీలించి అక్కడ వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ కలిపి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, క్రాస్ మిత్రులు పాల్గొన్నారు

పోలమాంబ ఆలయ ఇఒగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పోలమాంబ అమ్మవారి దేవస్థానం ఇఒగా బి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయం నుండి బదిలీపై వచ్చారు.

సువర్ణముఖి నదిలోకి నీరు విడుదల

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టులోనికి అధికంగా నీరు వచ్చి చేరడంతో గురువారం సాయంత్రం సువర్ణముఖి నదిలోకి నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. రెగ్యులేటర్లు ద్వారా సుమారు వంద క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నామని తెలిపారు. ఈ విషయాన్ని నదీ పరివాహాక ప్రాంత ప్రజలు గమనించాలని అధికారులు కోరారు.

సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దిగువమండ సర్పంచ్ హైమావతి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించారు. తన ఇంటికి స్వయంగా వెళ్లి త్వరగా కోలుకోవాలని మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆమె అన్నారు.

ఓటర్లుగా చేర్పించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కర్నీ ఓటరుగా చేర్చాలని, అలాగే మరణించిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించాలని డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కర్నీ ఓటరుగా చేర్పించాలని, ప్రతి బూత్‌లో 1200 ఓటర్లు కన్నా ఎక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్లు గుర్తించాలని, ఓటర్ జాబితాలో చనిపోయిన వారిని గుర్తించి సంబధిత బిఎల్ఒలకు అందించాలని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ బి.నీలకంఠరావు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్థానిక 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ఆటోనగర్ సబ్‌స్టేషన్, పాచిపెంట మండలం గురువు నాయుడుపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ కె.గోపాలరావునాయుడు అన్నారు. దీనికి వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన విద్యుత్‌శాఖ ఇఇ, డిఇలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కొత్తగా బాధ్యతలు చేపట్టిన విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్ స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే నివాస గృహానికి వెళ్లి కలిసి శాలువాతో సత్కరించి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గల విద్యుత్ సమస్యలు, వాటి పరిష్కారంపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. శిథిలమైన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, కొత్త లైన్లు ఏర్పాటు, గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. సమస్యల పరిష్కారానికి శాయి శక్తులా ప్రయత్నిస్తామని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యేకు అధికారులు తెలిపారు.

బాబు మోసాలను తెలుసుకోండి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ప్రజలకు 400 హామీలను ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలుపర్చకుండా ప్రజలను మోసగిస్తున్నారని, ఆయన చేస్తున్న మోసాలను ప్రజలు గుర్తించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని మరిపల్లిలో గురువారం బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేస్తున్న మోసాలను కరపత్రం ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైసీపీ కార్యదర్శి దండి శ్రీనివాసరావు, పోలి నాయుడు, ఎంపిటిసి సభ్యులు జన్ని సీతారాం, వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి

సీతానగరం : రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పాటిస్తూ పదిమందికి ఉపయోగపడేలా సూచనలు, సలహాలు అందించాలన్నారు. అలాగే వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల పట్ల స్నేహభావంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి జనసేనలోకి...

గుమ్మలక్ష్మీపురం: కొమరాడ మండలానికి చెందిన పలువురు వైసిపి నాయకులు గుమ్మలక్ష్మీపురంలో గురువారం జనసేనలో చేరారు. మండల అధ్యక్షులు తెంటు శ్రీకర్ ఆధ్వర్యంలో కురుపాం ఎఎంసి వైస్ చైర్మన్ గార గౌరీశంకర్ సమక్షంలో నియోజకవర్గం సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు సాదరంగా స్వాగతం పలికి జనసేన కండువా వేశారు. చేరిన వారిలో కొమరాడ మండలం శివిని పిఎసిఎస్ మాజీ చైర్మన్, విక్రాంపురం వైసిపి సీనియర్ నాయకులు పప్పల గోపాలకృష్ణ, అధికారి శ్రీనివాసరావు (బుజ్జి), రాయల్ అకాడమీ శివిని సిఇఒ గొట్టాపు రేణుక, ఆరిక కన్నిగ, హిమరిక కలంబిల్లి, ఆరిక పరమేష్ అనుచరులు, మహిళా కార్యకర్తలు చేరారు. నాయకులు అధికారి అనిల్, సర్పంచ్ క్రాంతి, సుజిత్ దుర్గ, పాల్గొన్నారు.

న్యాయ సంరక్షణ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - భామిని

విద్యార్థులు కేవలం జ్ఞానం, విజ్ఞానం కోసమే నిరంతరం శ్రమించాలని, లేనిపోని వ్యసనాలతో, తప్పుడు మార్గంలో ప్రయాణిస్తూ జీవితాలను నాశనం చేసుకోవద్దని పాలకొండ డిఎస్‌పి రాంబాబు అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థులకు న్యాయ సంరక్షణ చట్టాలపై బత్తిలి ఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తప్పు చేశాక, తెలియక చేశాం, వదిలేయండి అంటే అవ్వదని తప్పుకు తగ్గ శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంరక్షణ చట్టాల పైన, వ్యసనాలకు బానిసైతే జరిగే పరిణామాల పైన, అమ్మాయిల పైన చెడుగా ప్రవర్తిస్తే వచ్చే శిక్షల పైన అవగాహన తప్పనిసరి ఉండాలని బత్తిలి ఎస్ఐ అప్పారావు తెలిపారు. అనంతరం పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై, అమ్మాయిలపై తప్పుగా ప్రవర్తిస్తే, పడేటటు వంటి శిక్షలపై అవగాహన కల్పించారు. తప్పు చేస్తే చట్టం నుండి తప్పించుకునే పరిస్థితి లేదని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాబురావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బామిని : సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి

చట్టాలపై అవగాహన

వీరఘట్టం: స్థానిక కెజిబివిలో గురువారం స్థానిక ఎస్ఐ జి.కళాధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళపై దాడులు, లైంగిక వేధింపులు, పోక్సో చట్టంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ ఉషారత్న కుమారి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సంకల్పం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఎస్ఐ లావణ్య, ఎఎస్ఐ సంజీవ్ సైబర్ నేరాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బెట్టింగులు చేయరాదని చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. సంకల్పం ప్రాముఖ్యత గురించి వివరించి క్యూఆర్ కోడ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుశాంత్ జన, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ రావు, బోధకులు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను నెరవేరుస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వంగా నిలుస్తుందని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు పట్టణంలోని 29వ వార్డులో "ఇంటింటికి తెలుగుదేశం - సుపరిపాలనలో తొలి అడుగు 4.1" కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఎవరికీ ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అటువంటి ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. ఈ ఏడాది కాలంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ రానున్న కాలంలో మరిన్ని పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం వైపు అడుగులు వేయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, కౌన్సిలర్లు హర్ష, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

సీతానగరం: మండలానికి ఆయువుపట్టులాంటి బల్ల కృష్ణాపురంతో సహా సమీప 5 గ్రామాల ప్రజల తాగునీటి సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర హామీ ఇచ్చారు. సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం బల్ల కృష్ణాపురంలో గురువారం సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులను కలిసి వారి యోగక్షేమాలు, కష్ట సుఖాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, పనులు సంక్షేమ కార్యక్రమాల గురించి ఆరా తీశారు. గత ఏడాదిలో చంద్రబాబు ప్రభుత్వ పాలన గురించి ప్రజల నుంచి అభిప్రాయం సేకరించారు. గ్రామానికి చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బల్ల కృష్ణాపురం ఒకప్పుడు ప్రతిపక్షాలకు కంచుకోట అని ఇప్పుడు టిడిపికి సొంతమైందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా తనను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎంతగానో అభిమానిస్తున్న ఈ గ్రామస్తుల రుణం తీర్చుకునేందుకు శాయ శక్తులా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. గతంలో తాగు నీరు లేక ప్రజలు ఎంతో ఇబ్బంది పడే వారని, ఇప్పుడు ఇంటింటికి తాగునీరు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఇకపై రెండు పూటలా నీరు సరఫరా చేస్తామని, భవిష్యత్తులో 24 గంటలు నీరు సరఫరాకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, వేణుగోపాలనాయుడు, మండల పార్టీ నాయకులు పెద్దబ్బాయి, గుణుపూరు అన్నమనాయుడు, గొట్టాపు అప్పారావు, బాల శ్రీనివాసరావు, నాయకులు తిరుపతిరావు, ధనుంజయనాయుడు, సంతోష్ కుమార్, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



కురుపాం: కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం: కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన, సుస్థిర అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని మొండెంఖల్‌లో గురువారం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గూర్చి ప్రజల అభిప్రాయాలు సేకరించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఐటిడిఎను ప్రజాభిప్రాయ సేకరణ షెడ్యూల్లో చేర్చాలి

ప్రజాశక్తి- సీతంపేట

జిఒ 3పై రంపచోడవరం, పాడేరు, పార్వతీపురం ఐటిడిఎలో అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారని. ఇక్కడ ఐటిడిఎను ఆ షెడ్యూల్లో చేర్చకపోవడం బాధాకరమని ఆదివాసి జెఎసి అధ్యక్షులు బి.శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ జీవో నెంబర్ మూడు పై ప్రజా అభిప్రాయ సేకరణ షెడ్యూల్లో సీతంపేట ఐటిడిఎని కూడా చేర్చాలన్నారు. ఇప్పటికే సీతంపేట ఐటిడిఎ తరలిపోతుందని అపోహలు ఉన్నాయన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అనుబంధంగా ఉన్న ఐటిడిఎ పలాస, మందస, టెక్కలి, సోంపేట మండలాల్లో గిరిజనులు ఉన్నారని ఐదో షెడ్యూల్లో జీవో నెంబర్ 3 జీవనాడిని చెప్పారు. ఈయనతో పాటు ఆ నాయకులు బి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సిగ్నల్ పాయింట్ వద్ద గురువారం తెల్లవారుజామున విశాఖ నుంచి రాయపూర్ వెళ్తున్న సమయములో లారీ వెనుక టైర్లు దగ్గర ఉన్న బోల్టు విరిగిపోయాయి. దీంతో టైర్లు ఊడి రోడ్డుపై పడిపోవడంతో లారీ అక్కడికక్కడే ఆగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఉదయం జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిస్థితి చక్కదిద్దారు..

బాలేసుగూడ సందర్శన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లోవముఠా ప్రాంతంలోని బాలేసుగూడ గిరిజన గ్రామాన్ని ఎంపిడిఒ త్రివిక్రమరావు గురువారం సందర్శించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 21 కుటుంబాలు జీవిస్తున్న ఈ గ్రామానికి సమీపంలో ఉన్న తాగునీటి బావిని, వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

నియోజకవర్గ కేంద్రమైన పాలకొండలో గత కొంతకాలంగా అగ్నిమాపక కేంద్ర భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇది తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దానిపై పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదించినట్టు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. గురువారం గారమ్మ కాలనీ సమీపాన రూ.కోటీ 34 లక్షలతో భవనానికి శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో అన్ని పనులు చేపడతామన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కూడా కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సింహాచలం, ఎంపిపి బొమ్మల భాను, నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, ఎఎంసి చైర్మన్ బిడ్డిక సంధ్యారాణి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, వైస్ ఎంపిపి వాకుమూడి అనిల్, జాడ శ్రీధర్, వెన్నపు శ్రీనివాసరావు, గంగునాయుడు, స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి సర్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

రూ.100 కోట్ల ఆస్తి చూపిస్తే.. మీకే ఇచ్చేస్తా

మాజీ ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

తన ఆస్తులు రూ.100 కోట్లు అని పదేపదే ఎమ్మెల్యే జగదీశ్వరి ఆరోపిస్తున్నారని, రూ.100 కోట్లు ఎక్కడున్నాయో చూపిస్తే మీకు రూ.90 కోట్లు ఇచ్చేస్తానని మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. గురువారం చినమేరంగిలో గల తన కోట వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను మర్చిపోయి ఏడాది పాలనలో నియోజకవర్గానికి చేసింది ఏమి లేక ఎమ్మెల్యే అసహనంతో ఏం మాట్లాడుతున్నారో ఆమెకే అర్థం కాక వ్యక్తిగత ఆరోపణలు నాపై చేస్తూ రాచరిక కోట అనే విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. కోట లేకపోతే మీకు ఎమ్మెల్యే సీటు ఎక్కడదని, మీకు ఎమ్మెల్యే సీటు ఇచ్చిన కోటకే రాచరిక కోటని అంటున్నావని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేయలేదని పదేపదే అంటున్నావని, రూ.150 కోట్లతో నియోజవర్గ కేంద్రంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల తీసుకొచ్చి 70 శాతం పనులు పూర్తి చేసిన ఘనత తనదేనన్నారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రూ.3కోట్లతో ఆసుపత్రి భవనాన్ని నిర్మించి 90శాతం పనులు పూర్తిచేసిన నేటికి ఏడాదైన నువ్వు ఎమ్మెల్యేగా పదవి బాధ్యతలు చేపట్టి 10శాతం పనులు పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభించలేకపోతున్నావని అన్నారు. దీనివల్ల ఒక బెడ్ మీద ముగ్గురు, ఇద్దరు గర్భిణీలు బాలింతలు ఉండాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. తోటపల్లి, కురుపాం రోడ్డు 16 కిలోమీటర్ల రూ.33 కోట్లతో పనులు తాము పూర్తి చేస్తే కేవలం రెండు కిలోమీటర్లు సీమనాయుడువలస నుంచి పెదమేరంగి జంక్షన్ వరకు సిసి రోడ్డు వేసి గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. స్వాతంత్ర్యం రాక ముందు నుంచి ఉన్న గిరిజన గ్రామాలకు నా హయంలో రోడ్లు వేస్తే మౌలిక వసతులు కల్పించాలని, పూర్ణపాడు లాభేసు వంతెనకు రూ.70 శాతం పనులు తన హయాంలో అయ్యావని, నిధుల చాలక ట్రైబల్ సప్లై నుంచి ప్రత్యేక నిధులుగా రూ.14 కోట్లు తాను మంజూరు చేయించానని తెలిపారు. ఇంకా కేవలం 30 శాతం పనులు మాత్రమే మిగులున్నాయని, ఇప్పుడు మీ హయాంలో కనీసం ఇంతవరకు టెండర్ కూడా జరగలేదని అన్నారు. తనపై విమర్శలు మాని నియోజకవర్గాన్ని అభివృద్ధిలో దృష్టి పెడితే బాగుంటుందని, నాపై చేసిన ఆరోపణలు నిరూపించడానికి సిద్ధమైతే, సమయం, స్థలం చెప్పు వస్తాననని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీపీలు , జడ్పీసీలు, మండల కన్వీనర్లు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దళిత మహిళపై అక్రమంగా కేసు పెట్టడం సమంజసం కాదు

ఎమ్మెల్యే జగదీశ్వరి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. కురుపాం నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు ఈత్తిలి మణి ఏడాదిలో చేసిన అభివృద్ధిపై ఫేస్బుక్లో అడిగినందుకు దళిత మహిళ అని కూడా చూడకుండా అక్రమంగా కేసు పెట్టి సెల్ ఫోన్ లాక్కొని రెండు రోజులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పడం సమంజసం కాదని అన్నారు. తమపై కూడా వారి ఫేస్బుక్లో పెట్టి నచ్చినట్లుగా పోస్టులు పెట్టారని, వారిపై కూడా తాము కేసు పెట్టామని, పోలీసు చర్యలు తీసుకోవాలని, లేనిచో కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు.

చంద్రబాబు డకౌట్ అయ్యారు : ఎంపి

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

సూపర్ సిక్స్ హామీలు ప్రజలకు అందించకుండా చంద్రబాబు డకౌట్ అయ్యారని అరకు ఎంపి గుమ్మా తనూజరాణి అన్నారు. వైసిపి పార్వతీపురంలో గురువారం పార్వతీపురం పురపాలక సంఘం, మండలం వైసిపి విస్తృత స్థాయి సమావేశం పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో భాగంగా క్యూ ఆర్ కోడ్ ద్వారా డాక్యుమెంట్ రిలీజ్ చేశారు. ఈ డాక్యుమెంట్‌లో చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పుడు ఎలా ఎగ్గొడుతున్నారో చూసి ప్రజలకు వివరించాలని ఎంపి తనూజ రాణి తెలిపారు. ఏడాది పాలనలో టిడిపి కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, రాష్ట్ర వైసిపి కార్యదర్శి మాజీ తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ఏడాది కాలంగా రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు చేస్తున్న మోసాలను తెలియజేయడమే కాకుండా ఇస్తామన్నా సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ఎలా ప్రజలను మోసం చేస్తున్నారన్న విషయాన్ని ఈ కార్యక్రమం ద్వారా మండలం వ్యాప్తంగా ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమం 21నుంచి గ్రామంలో, వార్డులో ఎంపిక చేసిన ప్రాంతంలో రచ్చ బండ మాదిరిగా కుర్చీలు వేసుకుని, వారికి వివరించేలా చేయాలని కేడర్‌కు దిశానిర్దేశం చేస్తూ ఆ కార్యక్రమంలో జగన్ 35 నిమిషాల వీడియో లేదా, ఆడియోను వారికి వినిపించాలని చెప్పారు. ఈ సమావేవంలో పట్టణ మండల అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి సిద్దా జగన్నాథం, బి.రవికుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి ముప్వల సత్యం నాయుడు, రాష్ట్ర విభాగాల కార్యదర్శులు ముగడ జగన్, బి వాసుదేవరావు, డి నాగరాజు, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎన్ శ్రీనివాసరావు, మైనారిటీ సెల్ అధ్యక్షులు సఫీ, నియోజకవర్గ విభాగాల అధ్యక్షులు గొర్లి మాధవరావు తదితరులు పాల్గొన్నారు..

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి తనూజారాణి

బెలగాం రైల్వే గేటు సమస్య పరిష్కారానికి కృషి

పట్టణంలోని బెలగాం రైల్వే గేట్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అరకు పార్లమెంట్ సభ్యులు తనూజా రాణి అన్నారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు నివాసానికి గురువారం వచ్చిన ఆమెకు బాలగొడబ గ్రామపెద్దలు బెలగాం గేటు సమస్యపై వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎంపితో మాట్లాడుతూ బెలగాం వద్ద రైల్వే లెవెల్ క్రాసింగ్ ఉందని, దీని గుండా నిత్యం పలు రైళ్లు, గూడ్సులు తిరుగుతున్నాయని, ప్రతి పది నిమిషాలకు ఒక ట్రైను తిరుగుతూనే ఉందని, దీంతో తరచూ గేట్లు పడుతున్నాయని అన్నారు. ఇటీవల మూడో లైను కూడా వేశారని, దీంతో ఆ గేటు మీదుగా మున్సిపాలిటీలోని బంగారమ్మకాలనీ, కొత్త బెలగాం, సాయిరాం కాలనీలు, పార్వతీపురం మండలంలోని బాలగుడబ, గరుగుబిల్లి మండలంలోని సన్యాసిరాజుపేట, పెదగుడబ, చినగుడబ, వల్లరిగుడబ, బురదవెంకటాపురం, రాయందొరవలస, ముత్యం దొరవలస తదితర గ్రామాల ప్రజలు ఈ రహదారి గుండా రాకపోకలు సాగించాల్సి ఉందని అన్నారు. ప్రతి పది నిమిషాలకు గేటు పడుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అత్యవసర సమయంలో అంబులెన్సులు సైతం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాల, కళాశాల విద్యార్థులు సైతం సకాలంలో విద్యాసంస్థలకు చేరలేకపోతున్నారని తెలియచేస్తూ అండర్ బ్రిడ్జి మంజూరు చేయాలని ఎంపిని కోరారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్, జడ్పీటీసీ బలగ రేవతమ్మ, అధికార ప్రతినిధి ముప్వల సత్యంనాయుడు, సర్పంచ్ ప్రతినిధి పండు, వైస్ సర్పంచ్ వర్రి శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

ప్రజాశక్తి- సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ప్రతిరోజు రుచికరమైన భోజనం పెట్టాలని ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అన్నారు. గురువారం ఆయన సీతంపేట మండలంలోని చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉండాలని సూచించారు. భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు జరుగుతున్న గణితం క్లాసును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం పారిశుధ్య పక్షోత్సవాలలో భాగంగా సీతంపేట గ్రామంలో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో ఆయన పాల్గొని వీధులు శుభ్రంగా ఉండాలని, కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. పులిపుట్టి, హడ్డుబంగి సచివాలయాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సర్పంచ్ కళావతి, కార్యదర్శి రామకృష్ణ, డిప్యూటీ వార్డెన్ రామకృష్ణ, సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో ఖాళీలను భర్తీ చేయాలి

ఇ.యు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆర్‌టిసిలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ఎపియస్ ఆర్‌టిసి ఉద్యోగులకు విలీనం అనంతరం ఇహెచ్‌యస్ ద్వారా సరైన వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారని దీని వల్ల ఏడాదికి సుమారు 350 మంది ఉద్యోగులు చనిపోతున్నారని ఇయు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు అన్నారు. గురువారం జిల్లా ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నిర్మాణ సభ జిల్లా అధ్యక్షులు మరిపి శ్రీనివాస రావు అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి పైల సుందరరావు ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి ఉద్యోగులరను ఆదుకొనే విదంగా విలీనంకు ముందున్న పాత పద్ధతుల్లోనే రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్య సౌకర్యాలు అందించాలని, మెడికిల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. విలీనానికి ముందు పెండింగు ఉన్న కారుణ్య నియామాకలు బాధితులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు చెల్లించాల్సిన 24 నెలలు 11వ పిఆర్‌సి ఎరియర్సును, డిఎ బకాయిలను చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ఎపిజెఎసి జిల్లా చైర్మన్ గొట్టాపు శ్రీరామూర్తి, ఇయు రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి పి.బానుమూర్తి, విజయనగరం జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, విజయనగరం జిల్లా ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి గొల్లపల్లి రవికాంత్, పాలకొండ, సాలూరు, పార్వతీపురం డిపోల అధ్యక్ష, కార్యదర్శులు యంవి సాగర్, యల్‌డి నాయుడు, టి.రాంబాబు, జెక్కపూడి కిరణ్, డిఎ నాయుడు, కత్తిరి నర్శింగరావు తదిరులు పాల్గొని డిపో నుండి ఎన్‌జిఒ హౌమ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చీడిమానూగూడ చెందిన సవర తవిటి రాజు (51) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం చీడిమానుగూడకు చెందిన తవిటిరాజు ఈతమానుగూడ నుంచి సీతంపేట వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తవిటిరాజుకు గాయాలు కావడంతో సీతంపేట ఏరియా ఆసుపత్రిలో 108 వాహనం ద్వారా తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. అయితే మృతుడికి భార్య సవర సరోజిని, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దీనిపై ఎస్సై వై.అమ్మన్నరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందుతాయని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సిఎస్ఆర్ నిధులతో రూ.13లక్షలతో కొనుగోలు చేసిన సిఎఆర్ఎం మిషన్‌ను ఎమ్మెల్యేతో పాటు పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలున్నాయని, త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు కూడా పూర్తి చేసి అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రతి రోగులతో మాట్లాడి జ్వరాలపై ఆరా తీశారు. పిఒ మాట్లాడుతూ సిఎఆర్ఎం ద్వారా ఎముకలు విరిగిన ఈ మిషన్ సహాయంతో సులభంగా ఆపరేషన్ జరుగుతుందని చెప్పారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. సకాలంలో వైద్య సేవలందుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ సంధ్యారాణి, డిడి అన్నదొర, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త నాగభూషణం, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంఒ శ్రీనివాస్, సర్పంచ్ ఎ.కళావతి. టిఎస్‌పి సభ్యులు సవర మాలయ్య, మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొఖలింగం, కూటమి నాయకులు హెచ్ పవన్, హెచ్.ప్రసాద్, ప్రవీణ్, సాయి, సోను పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ

పార్వతీపురం టౌన్ : హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఆర్.బిఎస్.కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. పట్టణంలోని 16వ వార్డులో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహాన్ని గురువారం సాయంత్రం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో విద్యార్థుల్లో ఎవరికైనా అనారోగ్య సమస్యలు ప్రబలాయా అని సిక్ రిజిస్టర్ పరిశీలించారు. ఏవిధమైన ఆరోగ్య సమస్యలు తలెత్తాయి, అందజేసిన చికిత్సా, రిఫర్ చేసిన వివరాలు,నివారణ అయిన తేదీలు గమనించారు. ప్రాథమిక చికిత్స నిమిత్తం హాస్టల్‌లో ఉంచిన మందులను పరిశీలించారు. విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ సంబంధించిన ఆర్బిఎస్కె కార్డులు తనిఖీ చేశారు.దోమల మందు స్ప్రేయింగ్ ఎప్పుడు చేపట్టారన్నారు.